

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు రెండు పతకాలు

- డేకథ్లాన్‌లో వెండి పతకం
- జావెలిన్ త్రోలో కాంస్యం

7



మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జలాలను చూసి సంతోషిస్తున్న హరీశ్‌రావు, సునీతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కేసీఆర్ కల నెరవేరింది

- భారీ కాన్వాయ్‌తో మల్లన్నసాగర్‌కు బీఆర్ఎస్ నేతలు
- రిజర్వాయర్‌లో జలాలను చూసి పులకింత
- గోదారమ్మకు పూలు చల్లి హరీశ్ పూజలు



అభివాదం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

తొగుట, సెప్టెంబరు 20 : మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జల పరవళ్లను చూసి గులాబీ శ్రేణులు పరవశించారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామారెడ్డి, యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు భారీ కాన్వాయ్‌తో మండలంలోని తుక్కాపూర్ సమీపంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. వారికి పార్టీ నాయకులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. రిజర్వాయర్ వద్దకు చేరుకోగానే జోరు వర్షం పడటంతో వానలో తడుస్తూ మల్లన్నసాగర్‌లో గోదావరి జలాలను చూసి పులకించారు. కేసీఆర్ కలలు కన్న కాళేశ్వరం ఫలాలు నేటికి నెరవేరాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీటిలో పసుపుకుంకుమ, పూలు చల్లి గోదారమ్మకు పూజలు చేశారు.

ఆనాడు కేసులు.. ఈనాడు డైవర్షన్ పాలిటిక్స్

ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మల్లన్నసాగర్ నేడు నిండుకుండలా కనిపిస్తూ కన్నులపండుగగా ఉందన్నారు. కేసీఆర్ కల నేరవేరిందన్నారు. ఈ నీటితో పండిన పంటలో ప్రతీ గింజపై కేసీఆర్ పేరు ఉంటుందన్నారు. ఆనాడు ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతుంటే అడ్డుకుని కోర్టుల్లో కేసులు వేశారని, నేడు నిండుకుండలా తలపిస్తున్న మల్లన్నసాగర్ సందర్శనకు వస్తే కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ జలాలతో మెదక్, యాదాద్రి, సిద్దిపేట జిల్లాలలోని రైతుల పొలాలు పండటం మీకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకుపోయి మూసీనదిని శుభ్రం చేస్తానంటున్నాడని, తాగునీటిని అందిస్తానంటున్నాడని, ఇది కేసీఆర్ కట్టిన మల్లన్నసాగర్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేతలు గుర్తించుకోవాలని హితవు పలికారు. గతేడాది ఆగస్టులోనే చేపపిల్లలు వేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించామన్నారు. కానీ ఈ ఏడాది సెప్టెంబరు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు చేపపిల్లల పంపిణీ చేయక పోవడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోలేదని, రేవంత్‌రెడ్డి నోరు కుళ్లిపోయిందన్నారు. మల్లన్నసాగర్‌కు వచ్చి కాళేశ్వర జలాలతో పుకిలించుకుంటే ఆయన నోరు శుభ్రమవుతుందని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతల పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, అరుణ్‌కుమార్, కనకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములపై కొంత మంది కన్నుపడింది. దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. గుట్టలను సైతం వదలకుండా ఎక్స్‌కవేటర్లతో చదును చేసి పంటలు వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

సర్కారు భూమిలో సాగు

చదును చేసి దర్జాగా కబ్జా

- గౌరవెల్లి ప్రాజెక్టు ఆనుకుని స్థలాలు
- గుట్టలను సైతం వదలని ఆక్రమణదారులు
- పట్టా పాస్‌బుక్‌లు పొందేందుకు స్కెచ్
- పట్టింపులేని రెవెన్యూ అధికారులు

అక్కన్నపేట, సెప్టెంబరు 20 : అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద గౌరవెల్లి ప్రాజెక్టును నిర్మించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కట్టకు ఆనుకొని గౌరవెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 139లో 39.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించడంతో ఇక్కడి భూములకు భారీగా ధరలు పెరుగుతున్నాయి. ఎకరాకు రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ధర పలుకుతుండడంతో ప్రభుత్వ భూములపై ఆక్రమణదారులు కన్నేశారు. ఈ సర్వే నంబర్‌లో ఉన్న ఖాళీ భూములతో పాటు గుట్టను సైతం ఆక్రమించి చదును చేయిస్తున్నారు. మరికొందరైతే చదును చేసిన భూముల్లో పత్తి, కంది, తదితర పంటలను సాగు చేసి మోకాపై ఉన్నారు. ప్రభుత్వం ఒకవేళ భూ ప్రక్షాళన ప్రారంభిస్తే మోకాపై ఉండి సాగు చేసుకుంటున్నామని చెప్పి, అవసరమైతే ఎంతో కొంతో డబ్బు ముట్టజెప్పి పట్టా పాస్‌బుక్‌లు పొందవచ్చనే ఆలోచనలో కబ్జాదారులు ఉన్నట్లు సమాచారం.

ఫిర్యాదు చేసినా..

దాదాపు రూ.25 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారు. రికార్డులలో ప్రభుత్వ భూమిగా ఉండగా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే భూములు మొత్తం కబ్జాకు గురైనట్లు కనిపిస్తున్నాయి. గౌరవెల్లి గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. ఏదో నామ్‌కేవాస్తేగా కిందిస్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాల, సమీకృత విద్య భవనాల ఏర్పాటు చేస్తే కబ్జాల నుంచి భూమిని కాపాడిన వారవుతారని స్థానికులు అంటున్నారు.



గౌరవెల్లి ప్రాజెక్ట్ పక్కన ప్రభుత్వ భూమిలో సాగుచేస్తున్న పత్తి పంట



ఎక్స్‌కవేటర్‌తో చదును చేసిన గుట్ట

పట్టించుకోవడం లేదు



గౌరవెల్లిలో ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేశారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి. ఆ భూముల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాల, సమీకృత విద్య భవనాల సముదాయం నిర్మించాలి. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గొల్లపల్లి వీరాచారి, గౌరవెల్లి గ్రామస్థుడు

కబ్జా చేస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా సరే వారిని ఉపేక్షించేది లేదు. ఐదు రోజుల క్రితం గుబ్బడి తండాలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి యంత్రాలతో చదును చేస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశాం. గౌరవెల్లిలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి కబ్జా చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

- ఉట్కూరి అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట

ప్రజా ఉద్యమాలకు సాయుధ పోరాటమే స్ఫూర్తి

ఈ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కూనంనేని

గజ్వేల్, సెప్టెంబరు 20: ప్రజా ఉద్యమాలకు సాయుధ పోరాటమే స్ఫూర్తి అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో 76వ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాల, త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం సాగిందని, దీనిని హిందూ, ముస్లింల గొడవగా బీజేపీ వక్రీకరిస్తుందని మండిపడ్డారు. 4,500 మంది అమరుల రక్తతర్పణంతో తెలంగాణకు విముక్తి కలిగిందన్నారు. వారి పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాల విధానాలపైన పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర నాయకులు ప్రకాశ్‌రావు, దయానందరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేష్, కిష్టపురం లక్ష్మణ్, అందే అశోక్, నాయకులు స్వర్గం రాజేశం, చింత శ్రీను, నర్సింహారెడ్డి, జేరిపోతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోషకాహారం అందించాలి

ఆరోగ్యవంతంగా తయారు చేయడమే పోషణ మహోత్సవం ఉద్దేశం : కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 20 : పిల్లలందరికీ పోషకాహారం అందించాలని, ఆరోగ్యవంతంగా తయారు చేయడమే పోషణ మహోత్సవం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సీడీపీవోలు, వైద్యశాఖ, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్‌లకు పోషకాహార కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ నరసింహారావు జూమ్ ద్వారా ఎస్ఎస్‌పీ ప్రోగ్రాం వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనచౌదరి మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, సంక్షేమ శాఖ సమన్వయంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతీ పిల్లవాని ఆరోగ్యాన్ని సమీక్షిస్తూ మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి రెఫర్ చేసిన పిల్లలను అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమన్వయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్ఆర్‌సీలో అడ్మిట్ చేసి చికిత్స అందేటట్లు చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ పోర్టల్లో కొత్తగా మూడు ఆప్షన్లు

- కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ



కోహెడలో రుణమాఫీ కోసం ఏవోకు దరఖాస్తు చేస్తున్న రైతు కుటుంబం

కోహెడ, సెప్టెంబరు 20 : అర్హత ఉన్నప్పటికీ పలు కారణాలతో రుణమాఫీ దక్కని రైతు కుటుంబాల నిర్ధారణను వ్యవసాయ శాఖ చేపట్టింది. సాంకేతిక సమస్యలతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తాజాగా రుణమాఫీ పోర్టల్‌లో కొత్తగా మరో మూడు ఆప్షన్లు కేటాయించింది. కోహెడ మండలంలో మొత్తం 674 కుటుంబాలను నిర్ధారణ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 574 పూర్తయ్యాయి. ఇంకా మరో 100 కుటుంబాలున్నాయి.

క్షేత్రస్థాయి సమస్యలతో ఇబ్బందులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబసభ్యుల అందరి ఆధార్ కార్డు నంబర్లు నమోదు చేయాల్సి ఉండగా, మృతిచెందిన వారివి అందుబాటులో లేకపోవడం అధికారులకు సమస్యగా మారింది. అవివాహితులు, ఒంటరి వ్యక్తుల కుటుంబ నిర్ధారణకు రుణమాఫీ పోర్టల్లో ఆప్షన్ లేదు. కొందరు రైతులు ఇతర జిల్లాల్లో వ్యవసాయ భూములున్న ప్రాంతాల్లోని బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. అయితే వీరికి నివాస ప్రాంతాల్లోనే ఆధార్‌కార్డులు ఉన్నాయి. ఈ రైతుల కుటుంబ నిర్ధారణ కోసం ఇతర జిల్లాల ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేసే అవకాశం లేదు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను వ్యవసాయాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రుణమాఫీ పోర్టల్లో ఇటీవల మూడు కొత్త ఆప్షన్లు ప్రవేశపెట్టింది.

కొత్తగా చేర్చినవి ఇవే..

ప్రస్తుతం కుటుంబంలో జీవించి ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేస్తే సరిపోతుంది. ఒంటరి మహిళలు, అవివాహిత యువకులకు పట్టాదారు పాసుపుస్తకం ఉంటే ప్రత్యేకంగా కుటుంబాలుగా పరిగణించి ఆధార్ కార్డు నంబర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన ఆధార్ కార్డులను సైతం పరిగణనలోకి తీసుకునే అవకాశం కల్పించారు.

మూగరోదన

- కొత్త మండలాల్లో పశువైద్యశాలల్లేవ్
- సకాలంలో వైద్యం అందక మృత్యువాత

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 20 : గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు, గొర్రెలు, మేకలకు వైద్యం సకాలంలో అందడం లేదు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రాథమిక పశు వైద్యాశాలలు అందుబాటులో లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ మండలంలో పశు వైద్యాశాల ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో కొత్తగా ఏర్పాటైన నారాయణరావుపేట, దూళిమిట్ట మండలాల్లో ప్రాథమిక పశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదించారు. రూ.20 లక్షల వ్యయంతో ఒక్కో పశు వైద్యశాలకు సిద్ధం చేయాలని ఉత్తర్వులు కూడా వెలువడ్డా కానీ నేటికీ ఏర్పాటు కాలేదు. మద్దూరు నుంచి దూళిమిట్ట మండలంగా ఏర్పడగా అక్కడ ఉన్న పశు వైద్యశాల మద్దూరు మండలానికే పరిమితమైంది. సిద్దిపేట రూరల్ మండలం నుంచి నారాయణరావుపేట మండలం ఏర్పడగా కొత్త మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో పశు ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. నారాయణరావుపేట, దూళిమిట్ట మండలలాల్లో పశు వైద్య సిబ్బంది కొరత వేధిస్తుంది. దూళిమిట్ట మండలంలో 11 గ్రామాలు, నారాయణరావుపేట మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. పశు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఈ గ్రామాల పరిధిలోని మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు మెడికల్ షాపులపై ఆధారపడుతున్నారు. వారు ఇచ్చే మందులనే నమ్ముకుంటున్నారు. ఇటీవల నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఓ రైతుకు చెందిన సుమారు 94 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. దీంతో ఆ రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. అందుబాటులో పశు వైద్యశాల, సిబ్బంది లేకపోవడంతోనే మూగజీవాలకు వైద్యం అందలేదని మండిపడుతున్నారు. అత్యవసర సమయంలో వైద్యం అవసరం ఉంటే సుమారు 15 కిలోమీటర్ల దూరం వెళ్లి వైద్యం చేయించాల్సి వస్తుందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండల కేంద్రాల్లో పశు వైద్యశాలలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వ్యాధులకు గురై మృత్యువాత పడుతున్న మూగజీవాలు

జిల్లాలో పశు వైద్యశాలలు	5
ప్రాథమిక పశువైద్యశాలలు	37
పశు ఆరోగ్య ఉప కేంద్రాలు	51
సంచార పశు వైద్యశాలలు	5
గోపాల మిత్ర కేంద్రాలు	41
జిల్లాలోని పశువులు	3,53,062
మేకలు	2,10,267
గొర్రెలు	8,19,992



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న మండల అధికారులు(ఫైల్)

మండలానికి దూరంగా పశువైద్యశాల



ఒక్క దూళిమిట్ట గ్రామంలోనే 60 కుటుంబాలు గొర్రెలు, మేకలపై ఆధాపడి జీవిస్తున్నాయి. మండలానికి దూరంగా పశువైద్యశాల ఉండడంతో అక్కడికి పశువులను, గొర్రెలను, మేకలను తీసుకుపోలేకపోతున్నాం. మండలానికి ఒక ప్రాథమిక పశు వైద్యశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరించడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- శీరబోయిన అనిల్‌యాదవ్, దూళిమిట్ట

ఎన్నోసార్లు వినతులు ఇచ్చాం



నారాయణరావుపేట మండల కేంద్రంలో పశు వైద్యశాల ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చాం. వైద్యం సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాడిగేదెలకు సమయానికి వైద్యం అందడం లేదు. దీంతో గ్రామాల్లో రోజురోజుకూ పాడి గేదెలు తగ్గిపోతున్నాయి. పశు వైద్యశాలను ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటునివ్వాలి.

- దుంపటి బాలపోచయ్య, నారాయణరావుపేట

బావిలో దూకి తల్లీకూతురు ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం



ఆత్మహత్య చేసుకున్న తల్లీకూతురు శారద, స్పందన (ఫైల్)

బెజ్జంకి, సెప్టెంబరు 20 : కుటుంబ కలహాలతో బావిలో దూకి తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన బెజ్జంకి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శారదకు(35) జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన సాంబారి రాజేశ్వర్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు స్పందన(14), కుమారుడు రఘువరుణ్(9) ఉన్నారు. వీరి కుటుంబం నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం బెజ్జంకికి వచ్చి ఉంటున్నారు. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కుమార్తె స్పందన తొమ్మిదో తరగతి, రఘువరుణ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. రాజేశ్వర్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్య, కూతురుతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవపడ్డాడు. జీవితంపై విరక్తి చెందిన శారద, తన కూతురు స్పందన, కుమారుడు రఘువరుణ్‌ని తీసుకోని గ్రామ శివారులోని ఓ బావి వద్దకు వెళ్లింది. శుక్రవారం తెల్లవారుజామున రఘువరుణ్‌ను అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పి కూతురుతో కలిసి బావిలో దూకింది. భయపడిన రఘువరుణ్ ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చి జరిగిన విషయాన్ని పక్కింటి వారితో చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో తల్లికూతుళ్ల కోసం గాలింపు చేపట్టారు. మొదట తల్లి శారద మృతదేహం, కొన్ని గంటల తర్వాత కూతురు స్పందన మృతదేహం లభించింది. బావిలో నుంచి వెలికితీసిన తల్లికూతుళ్ల మృతదేహాలను చూసిన బంధువులు, స్థానికుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం తల్లికూతుళ్ల మృతదేహాలను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శారద తల్లి వడ్నాల రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

ఇంటితాళం పగులగొట్టి చోరీ

బంగారం, వెండి ఆభరణాల అపహరణ.. రామునిపట్లలో ఘటన

గంట్లమల్యాలలో రూ.70 వేల నగదు తస్కరణ

7

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కౌడిపల్లి,కొల్చారం సెప్టెంబరు 20 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిల మృతి చెందిన సంఘటన కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని వడ్డెర కాలనికి చెందిన ముద్దంగుల దుర్గమ్మ (55) అనారోగ్యంతో బాధపడుతున్నది. దీంతో ఆమె మెదక్ అసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తూ రోడ్డును దాటుతుంది. అప్పుడే ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీ కొనడంతో దుర్గమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి ఐదుగురు కూతురులు, కూమారుడు ఉన్నారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమొదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


దుర్గమ్మ (ఫైల్)

ప్రమాదవశాత్తు నీట మునిగి మత్స్యకారుడి మృతి

పాపన్నపేట, సెప్టెంబరు 20 : చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నాయికోటి కేశయ్య (58) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి గ్రామస్థులు, , పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న వారు స్థానికుల సాయంతో చెరువులో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుడి కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


కేశయ్య మృతదేహం

పత్తి పంటకు పురుగుల బెడద

● నివారణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 20: పది రోజుల క్రితం కురిసిన అధిక వర్షాలు, ప్రస్తుతం ఉన్న అధిక ఉష్ణోగ్రతల వలన పత్తి పంటకు పురుగుల బెడద నెలకొన్నది. రసం పీల్చే, లైన పచ్చదోమ, తామర పురుగుల తోపాటు పిండి నల్లి, కాయ కుళ్లు తెగులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నదని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


రైతులకు సూచనలు చేస్తున్నమండల వ్యవసాయ అధికారి వసంతరావు

వ్యవసాయ అధికారుల సూచనలివే..

ఎకరానికి లీటర్ వేప నూనె(1500పీపీఎం) గానీ, ఇమిడ క్లోప్రిడ్ 60 మిల్లీ లీటర్లు గానీ అసిట మాప్రైడ్ 100 గ్రాములు లేదా అసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పై మందులు మార్చి పిచికారి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కాయ కుళ్లు తెగులు నివారణకు 1 గ్రాము ప్లాంటమైసిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 10 లీటర్ల నీళ్లలో కలిపి మొక్కల కాయలపై పిచికారి చేయాలంటున్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 5 నుంచి 6 పెట్టుకొని వరుసగా రెండు రోజుల్లో ఏడు ఎనిమిది మగ పురుగులు పడినట్లయితే ఎకరానికి 1 లీటర్ వేప నూనెను గాని లేదా 100గ్రాముల ధయోమిథాక్సంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచిస్తున్నారు.

పత్తి పంట పరిశీలన..


పత్తి పంటలో పురుగు సోకుతున్న పంటలను మండల వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల, ఆలిరాజుపేట గ్రామాలలోని పత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు సందర్శించారు. అధికారుల సలహాలు సూచనల మేరకు మందులు పిచికారి చేయాలని ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శరణ్య, రైతులు కిష్టయ్య, బాలస్వామి, శౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌కు ఏఎన్ఆర్ అవార్డు

● ప్రకటించిన అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్


కంది, సెప్టెంబరు 20 : యాక్టింగ్ అండ్ ఫెర్మామెన్స్‌లో ప్రతిభ కనబర్చిన సంగారెడ్డి జిల్లా కందిపరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లోని లిబర్ ఆర్ట్స్ విభాగానికి అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శుక్రవారం నాడు ఏఎన్ఆర్ అవార్డును ప్రకటించారు. అక్కినేని నాగేశ్వరావు కుటుంబం ద్వారా స్థాపించిన యాక్టింగ్ అండ్ ఫెర్మామెన్స్ ఆర్ట్స్ కోసం ఏఎన్ఆర్ అవార్డును ఏర్పాటు చేశారు. అక్కినేని నాగేశ్వరరావు వారసత్వాన్ని పురస్కరించుకుని ఏఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు కళా రంగంలో అసాధారణ ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి వారికి ఈ అవార్డు ఇస్తారు. అయితే, ఐఐటీ హైదరాబాద్‌కు ఈ గౌరవాన్ని అందించినందుకు గర్వకారణంగా ఉందని, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 27న బ్రహ్మాండమైన విడుదల




సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
దేవి 70 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ (ఒక రోజు మాత్రమే)

ఈనెల 28న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
GLOBAL CINEMAS RELEASE

నేడే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SUPER HIT నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
NTR CINEMAS 9030161717

విజయవంతమైన 3వ వారం



సెన్సేషన్ సప్తగిరి 70ఎంఎం - ఖైరతాబాద్ 6.30pm
GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి
హీరో విశ్వంత్ (కేరింత ఫేమ్) నటించిన 'మ్యూజికల్ లవ్‌స్టోరీ'



సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
RELEASING BY SAHASRA ENTERTAINMENTS
THRO PARAM JYOTHI FILMS 9848028739,9299999549

SUPER HIT నేడే చూడండి



మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00
మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,2.30
లక్ష్మీకళ - మూసాపేట్ 11.30am
అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70ఎంఎం - ఐరియాబాద్ 11.00,2.00,6.00,9.00
ఆరాధన 70ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి 70ఎంఎం - శంషాబాద్ 11.30,6.30
NTR CINEMAS 9030161717

4వ వారం



సుదర్శన్ 35 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.15,2.30,6.15,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

నేడే విడుదల



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ (ఆదివారం నుండి)
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రామకృష్ణ 70ఎంఎం ఎ/సి - అబిడ్స్ | మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట | లక్ష్మీకళ సినిప్లెడ్ - మూసాపేట్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

గంజాయి సాగుపై దాడులు

● మర్వెల్లిలో సాగు.. ఒకరిపై కేసు



ధ్వంసం చేసిన గంజాయి మొక్కలను చూపిస్తున్న పోలీసులు

వట్‌పల్లి, సెప్టెంబరు 20 : మండలంలోని మర్వెల్లిలో సాగు చేస్తున్న గంజాయి పంటను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జుట్టు చిన్న నర్సింహులు తన వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి రూ.2లక్షలు విలువచేసే 20 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. నిందితుడు చిన్న నర్సింహులుపై కేసు నమోదు చేసి జోగిపేటలోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో సీఐ పి.వీణారెడ్డి, ఎస్.ఐ అనీల్‌కుమార్, సిబ్బంది విఠల్, అనీల్‌కుమార్, మల్కయ్య, ప్రహ్లాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటితాళం పగులగొట్టి చోరీ

● బంగారం, వెండి ఆభరణాల అపహరణ

చిన్నకోడూరు, సెప్టెంబరు 20 : తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దమ్మ యాదవరెడ్డి భార్య పుష్పలత కొన్నిరోజుల క్రితం మృతి చెందింది. పంతులు సూచన మేరకు ఇంటిని వదిలి పెట్టి సిద్దిపేట పట్టణంలో నివాసముంటున్నారు. నిత్యం గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చూసుకుని వెళ్తుంటారు. శుక్రవారం యాదవరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి రామునిపట్లలోని తమ ఇంటి ఎదుట కారు పెట్టి వెళ్దామని రాగా.. మెయిన్ డోర్ గొళ్లెం తీసి కనిపించింది. అనుమానం ఇంట్లోకి వెళ్లి చూడగా కప్‌బోర్డులో ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి గొలుసులతో పాటు, రూ.520 కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంట్లమల్యాలలో రూ.70 వేల నగదు తస్కరణ..



చోరీ వివరాలు సేకరిస్తున్న రాజగోపాల్ పేట పోలీసులు

నంగునూరు, సెప్టెంబరు 20 : వేసిన తాళం వేసినట్లే ఉండగా, తలుపనకు ఉన్న బేడాన్ని రాడుతో వంచి ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నంగునూరు మండలం గట్లమల్యాలలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామల సుధాకర్ అనారోగ్య రీత్యా పుట్టింట్లో ఉన్న భార్యను చూసేందుకు అత్తగారింటికి గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం సుధాకర్ ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపు బేడాన్ని రాడుతో వంచినట్లు గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా దాచి ఉంచిన రూ.70 వేల నగదు కనిపించలేదు. రాజగోపాల్ పేట పోలీసులకు సమాచారం అందించగా వారు క్లూస్ టీంతో కలిసి అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

తూప్రాన్, సెప్టెంబరు20: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వెల్దుర్తి మండలం రామాయిపల్లికి చెందిన సుప్రజ(22)కు తూప్రాన్ పట్టణానికి చెందిన మామిండ్ల శ్రీకాంత్ (30)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసు గల కూతురు సంతానం. కొన్నిరోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన సుప్రజ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ..

మునిపల్లి, సెప్టెంబరు 20 : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గార్లపల్లికి చెందిన మన్నె మొగులయ్య(36) మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గ్రామంలోని తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తన భార్య ప్రమీలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి వెళ్లి అతడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమ వద్ద డీసీఎం క్లీనర్ మృతి



20టీఆర్ఎన్ 80: పరిశ్రమ గేటు వద్ద మృతిచెందిన రాంబాబు

మనోహరాబాద్, సెప్టెంబరు 20 : పరిశ్రమ గేటు వద్ద వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్ర రాష్ట్రం విజయనగరం జిల్లా రాజాం మండలంలోని ఐలపేట గ్రామానికి చెందిన రాంబాబు(43) డీసీఎంపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. డ్రైవర్‌తో కలసి విజయనగరం నుంచి మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమకు స్క్రాప్ లోడ్‌తో గురువారం సాయంత్రం వచ్చారు. పరిశ్రమ వద్దకు రాగానే డ్రైవర్ లోడింగ్ కోసం పరిశ్రమ లోపలికి వెళ్లాడు. క్లినర్ పరిశ్రమ వద్ద బయటే ఉండగా.. శుక్రవారం ఉదయం చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌గా రామచంద్రం

● సంగారెడ్డి సెంట్రల్ జైలుకు సంతోష్ కుమార్ బదిలీ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా జి. రామచంద్రం నియమితులయ్యారు. చర్లపల్లి సూపరింటెండెంట్‌గా ఉన్న సంతోష్‌కుమార్ రాయ్ ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉన్న సంగారెడ్డి సెంట్రల్ జైలుకు బదిలీ అయ్యారు. ఈమేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న జి. రామచంద్రం ఇటీవలే ఎస్పీగా పదోన్నతి పొందారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు.. చెలరేగిన మంటలు



చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20: చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో గ్రామ నడి ఒడ్డున గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలి భారీ శబ్దం వచ్చింది. ఒక్కసారిగా మంటల చెలరేగి చుట్టూ మంటలు వ్యాపించాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు మంటలను చల్లార్చారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలడం వల్ల గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

జోగిపేట, సెప్టెంబరు20: విధి నిర్వహణలో ఉన్న ఓ పంచాయతీ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని తాలెల్మలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాలెల్మ గ్రామపంచాయతీ కార్మికుడు మన్నె లక్ష్మయ్య (45)... శుక్రవారం వీధిదీపాలు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పాండు పేర్కొన్నారు.

రూ.200 కోట్ల పనులు ప్రారంభంకాలే..

నిలిచిన నిధులు.. వెక్కిరిస్తున్న శిలాఫలకాలు



పిల్లికొట్టాల్ శివారులో ఒకే చోట రూ.260 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు

- నిధులున్నా, స్థలమున్నా కాగితాలకే పరిమితమైన వైద్యకళాశాల పనులు
- స్థలం దొరక్క ముందుకుసాగని పట్టణ ఆరోగ్య కేంద్రం..
- పాలకులు స్పందించి పనులు షురూ చేయాలంటున్న పట్టణవాసులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 20: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది జిల్లా కేంద్రం పరిస్థితి. ఓవైపు కొన్ని పనులు మంజూరై రద్దుచేయగా.. మరోవైపు కొన్ని పనులకు నిధులున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో అభివృద్ధి ఫలాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా ఎనిమిది పనులకు రూ.260 కోట్లతో హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. ఇందులో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లను పట్టణంలోని 32 వార్డులలో వివిధ పనులు చేపట్టడానికి కేటాయించారు. అదేవిధంగా కురుమసంఘ భవనానికి రూ.2 కోట్లు, ఆర్యవైశ్య గౌడసంఘం భవనాలకు రూ.కోటి, మున్సిపల్ వార్డుల అభివృద్ధికి టీయూఎఫ్ ఐడీసీ నిధులు రూ.20 కోట్లు, ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు, పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.1.43 కోట్లు, దాయర రోడ్డు విస్తరణకు 7.80 కోట్లు కేటాయిరచగా.. అక్టోబర్ 5న శిలాఫలకాలు వేశారు.

నిధులున్నా ప్రారంభం కాని పనులు..

వైద్యకళాశాల ఏర్పాటుకు పిల్లికొట్టాల్ శివారులో 14 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. నిధులు కూడా కేటాయించినా అవి కాగితాలకు పరిమితమయ్యాయనే విమర్శలున్నాయి. భవన నిర్మాణ పనులు ఆర్‌అండ్‌బీ శాఖకు, పరికరాల కొనుగోలు తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (టీఎస్ఎంఎస్ఐడీ) శాఖలకు కేటాయించారు. దాదాపు సంవత్సరం కావొస్తున్నా పనులు ప్రారంభమైన దాఖలాలు కనిపించడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడగా అంచనాలు సిద్ధం చేస్తున్నట్లుగా సమాధానమిచ్చారు. రూ.1.80 కోట్ల పనులకు స్టేట్‌లెవల్‌లో టెండర్ పిలవాల్సి ఉంటుందని.. మావద్ద నుంచి సమాచారం సైతం తీసుకున్నట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ తెలిపారు. పై అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. మరో శాఖ అధికారిని సంప్రదించగా భవన నిర్మాణం పూర్తైతేనే పరికరాలు కొనుగోలుకు టెండర్లు పిలవడం జరుగుతుందని చెప్పుకొచ్చారు. రూ.7.80 కోట్లు కేటాయించిన దాయర రోడ్డు విస్తరణ పనులు మాత్రం ప్రారంభమై ఆగుతూ.. సాగుతూ అన్నచందంగా కొనసాగుతున్నాయి. అక్కడక్కడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేసి ఎక్కడికక్కడే పనులు నిలిపివేశారని స్థానికులు మండిపడుతున్నారు.

టెండర్ పూర్తి.. కేటాయించని స్థలం..

పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 1.43 కోట్ల కేటాయించినా ఈ పనులు కూడా ముందడగు పడటంలేదు. సంబంధిత టీఎస్ఎంఐడీ శాఖ అధికారులు టెండర్లు సైతం పిలిచారు. కానీ అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని.. అన్నట్లుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాలంటే ఇప్పటికీ స్థలం చూపకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారిస్తే తప్ప ఈ భవనం పనులు కూడా ముందడుగుపడే అవకాశం కనిపించడం లేదు.



నిలిచిపోయియిన దాయర రోడ్డు విస్తరణ పనులు

ఎస్‌డీఎఫ్ నిధులు రద్దు చేసిన ప్రభుత్వం..

పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు, సంఘ భవనాలకు రూ. 3 కోట్లు కేటాయించగా ప్రభుత్వం రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పరిస్థితులు మారిపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం హయాంలో హడావిడిగా మంజూరి ఇచ్చిన ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పనులకు సైతం తిరిగి నిధులు కేటాయించాలని స్థానిక కౌన్సిలర్లు కోరుతున్నారు. మరోవైపు సంవత్సర కాలంగా పట్టణ ప్రగతి నిధులు సైతం నిలిచిపోయాయని.. ఈ క్రమంలో మున్సిపల్ వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐఐటీహెచ్‌లో ఎన్‌సీసీ కార్యాలయం

● ప్రారంభించిన సెంట్రల్ గ్రూప్ కమాండర్



ఐఐటీహెచ్ విద్యార్థులతో సెంట్రల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం

కంది, సెప్టెంబరు 20 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను శుక్రవారం సెంట్రల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం సందర్శించారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్‌లోని ఎన్‌సీసీ క్యాడెట్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. అనంతరం ఆయన ఐఐటీహెచ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తెలంగాణ 33వ బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ సారియల్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ సునీల్ అబ్రహం ఐఐటీహెచ్ ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ భద్రత, క్రమ శిక్షణ కలిగినవారని కొనియాడారు. ప్రస్తుత సమాజంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎంతో అవసరమని, విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు బాధ్యతతో తగిన సహాయం చేస్తారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ధర్మబద్ధంగా, నిజాయితీగా ఉంటూ దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు అపూర్వమైన అభిరుచితో సానుకూల సమాజ సేవ చేయాలని ఐఐటీహెచ్ డైరెక్టర్ ఆకాంక్షించారు.



బద్దిపోచమ్మ గుడి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

బద్ది పోచమ్మ గుడికి ఆదరణ కరువు

● పునర్‌నిర్మించాలని కోరుతున్న భక్తులు

రాయపోల్, సెప్టెంబరు 20: మండలంలోని అనాజీపూర్‌లో ఉన్న పురాతన బద్దిపోచమ్మ గుడి ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నది. సాధారణంగా గ్రామాల్లో పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, మైసమ్మ తదితర ఆలయాలు ఉంటాయి. కానీ బద్ది పోచమ్మ ఆలయాలు ఉండడం అరుదు. ప్రస్తుతం వేములవాడలో, అనాజీపూర్‌లో మాత్రమే ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం వివిధ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లపై వేములవాడ ఆలయానికి అనాజీపూర్ మీదుగా వెళ్లేవారు ఈ గుడి సమీపంలోని చేదబావి వద్ద ఆగి అమ్మవారికి పూజలు చేసి వంట చేసుకుని తిని మళ్లీ బయలుదేరేవారని పెద్దలు చెబుతున్నారు. ఇటీవల ఆ బావి కనుమరుగుకాగా, గుడి కూడా శిథిలావస్థకు చేరింది. ఇదిలాఉండగా ఇటీవల కొందరు దుండగులు ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని దొంగిలించగా పోలీసులు నిందితులను పట్టుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని గ్రామస్తులకు అప్పగించారు. గుడి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అమ్మవారి ఆలయాన్ని పునర్‌నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

బంగారం కోసం మహిళ హత్య

● నిందిత దంపతులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మాసాయిపేట సెప్టెంబర్ 20: మాసాయిపేట మండలం సాజు తండాలో గిరిజన మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం చేగుంట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మాసాయిపేట మండలం సాజు గిరిజనతండాకు చెందిన గిరిజన మహిళ మలోతు లలిత(48) ఈ నెల 11న ఉపాధిహామీ డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లి తిరిగి రాలేదు. లలిత తల్లి దేవి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా లలితకు తూప్రాన్ కల్లు దుకాణంలో పరిచయమైన ఘణపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు వడ్డె కనకయ్య, వడ్డె ప్రమీల హత్య చేసినట్లు తెలిసింది. లలిత ఒంటిపై ఉన్న బంగారు, వెండి నగలను కాజేయాలనే ఉద్దేశంతో ముందస్తు పథకం ప్రకారం లలితను యాదగిరిగుట్టకు వెళ్దామని నమ్మించారు. ఈ మేరకు ఆమెను బైకుపై తీసుకువెళ్లి జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి అటవీ ప్రాంతంలో గొంతు నులిమి హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న రూ.35 వేలు విలువ చేసే ఆభరణాలను తస్కరించారు. అనంతరం తూప్రాన్‌లోని పాన్ బ్రోకర్ వద్ద నగలు కుదువ పెట్టి డబ్బుతో జల్సాలు చేశారు. కాగా, నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా చేధించిన చేగుంట పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు20: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు వచ్చాయని అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవపూర్‌కు చెందిన గ్యార లీలా ఆనంద్ డేకాథ్లాన్‌లో వెండి పతకం, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కొండపాక చెందిన నగేష్ అండర్ 18 విభాగంలో జువెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారన్నారు. వీరిని అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీపీఈటీఏ జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్ జిల్లా, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, సంఘ బాధ్యులు బయ్యారపు కనకరెడ్డి, ప్రభాకర్, కృష్ణ కుమార్, నిషంక్‌గౌడ్, సాగర్, స్వామి తదితరులు అభినందించారు.

డిపో సరే.. డ్రైవర్లు ఏరి?

- 45 ఉండాల్సిన చోట 35 మందే..
- పూర్తి స్థాయిలో నడవని బస్సులు



నర్సాపూర్ ఆర్టీసీ డిపో ఎదుట రహదారిపై ధర్నా చేస్తున్న సోలక్‌పల్లి వాసులు

నర్సాపూర్, సెప్టెంబరు 20: నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటు కావడంతో ఇక తమ ప్రయాణ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంతవాసులు ఆశించారు. అయితే, ప్రయాణికుల అవసరాలకు తగినట్లు బస్సులు నడపడంలో అధికారులు విఫలమవుతున్నారు. కారణంగా డిపోను ఏర్పాటు చేసిన అధికారులు.. అందుకు సరిపడా డ్రైవర్లను కేటాయించకపోవడమే కారణమని తెలుస్తోంది. దీంతో గ్రామాలకు సరిగ్గా బస్సులు రాక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో రెండో డిపో

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2022లో జూన్ 8న నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేశారు. మూడు అద్దె బస్సులను కలుపుకొని 29 బస్సులతో డిపో ప్రారంభమైంది. డిపోలో ప్రస్తుతం 36 మంది డ్రైవర్లు, 46 మంది కండక్టరులు, 30 మంది మెకానిక్‌లు, ఇతర సిబ్బంది 5గురు ఉన్నారు. డిపో ఏర్పాటు అయ్యాక ఆయా రూట్లల్లో బస్సులు నడపడం వల్ల రీజియన్ పరిధిలోనే అత్యధిక ఆదాయం వచ్చే డిపోగా పేరు తెచ్చుకుంది. అయితే, రాను రాను ఈ డిపోపై సరైన ఉన్నతధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పూర్తిస్థాయి డిపో మేనేజర్ లేక నిర్వాహణ అంతంతగా మారిందన్న విమర్శలున్నాయి.

విధుల్లో 30 మంది డ్రైవర్లే..

నర్సాపూర్ డిపోలో ఉన్న బస్సులకు అనుగుణంగా మొత్తం 45 మంది డ్రైవర్లు అవసరం. కానీ, డిపో పరిధిలో 36 మంది డ్రైవర్లు ఉన్నారు. ఇందులో కనీసం ఆరుగురు వివిధ కారణాలతో సెలవు తీసుకోవడం సహజమే. దీంతో ఉన్న 30 మందితోనే బస్సులను ఆయా రూట్లలో నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో డ్రైవరు రోజు ఆరుగంటలు పనిచేయాల్సి ఉంటుంది. కానీ, డ్రైవర్లు తక్కువ మంది ఉండటంతో డిపో పరిధిలోని అన్ని రూట్లలో బస్సులు నడపలేకపోతున్నారు. జిన్నారం మండలం నుంచి బస్సులు నడవడం లేదంటూ ఇటీవల విద్యార్థిను డిపో వద్ద ధర్నాకు దిగారు. బస్సులు నడవకపోవడంతో తాము చదువులు కొనసాగించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సాపూర్ డిపోకు డ్రైవర్లను కేటాయించాలని, పూర్తిస్థాయి డీఎంను నియమించాలని కోరుతున్నారు.

బస్సుల కోసం గ్రామస్తులు, విద్యార్థుల ధర్నా..

జిన్నారం/నర్సాపూర్, సెప్టెంబరు 20: బస్సు సర్వీసుల నిలిపివేతకు నిరసనగా సోలక్‌పల్లి వాసులు, తమ గ్రామాల మీదుగా బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ నాగారం, శేర్‌ఖాన్‌పల్లి, రొయ్యపల్లి తదితర గ్రామాల విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. నర్సాపూర్ బస్ డిపో ఎదుట ప్రధాన రహదారిపై నిర్వహించిన ధర్నాకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత నెల 14 నుంచి నర్సాపూర్ నుంచి సోలక్‌పల్లి, శివనగర్ మీదుగా నడిచే ఆర్టీసీ బస్సులను పూర్తిగా రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామాలకు బస్సులు నడపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, నాయకుడు రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ఎస్పీ అభినందనలు



వేణుగోపాలస్వామిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 20 : తెలంగాణ రాష్ట్ర అవిశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా టి.వేణుగోపాలస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రూపేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలువగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు అఫ్జల్, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జీవన్, జహంగీర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఆరుగురికి గాయాలు





ఘటనా స్థలంలో పడిపోయిన వృద్ధ జంట, బాలుడు

జోగిపేట, సెప్టెంబరు 20 : రెండు బైకు ఢీకొన్న ఘటన మండలంలోని డాకూరు గ్రామ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. ఎస్‌ఐ పాండు కథనం ప్రకారం అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధ జంట టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా, నారాయణఖేడ్ నుంచి ఇద్దరు చిన్నారులతో సహా ఓయువ జంట మోటార్ సైకిల్‌పై సంగారెడ్డి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారిద్దరి బైక్‌లూ ఢీకొట్టాయి, ఈ ప్రమాదంలో బాలుడు, బాలికతో సహా రెండు బైకులపై ఉన్న రెండు జంటలకూ తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే జోగిపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ

నర్సాపూర్, సెప్టెంబరు 20: నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సంతకు వచ్చిన ఓ మహిళ కళ్లలో కారం చల్లి మెడలో నుండి మూడున్నర తులాల బంగారు పుస్తెల తాగు అపహరించిన ఘటన సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం మండలంలోని మంతూరు గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ తన మనుమరాలుతో కలిసి కూరగాయలకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసింది. అదే సంతలో తెలిసిన ఓ మహిళ కలవడంతో ఇద్దరు కలిసి సాయంత్రం కల్లు తాగుదామని నర్సాపూర్ బస్టాండు సమీపంలో ఉన్న కల్లుదుకాణంకు వెళ్లి కల్లు తాగారు. అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో ఓ గుర్తు తెలియని మహిళ లక్ష్మిని అనుసరించి కండ్లలో ఒక్కసారిగా కారం చల్లి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు అపహరించుకుపోయింది. వెంటనే తేరుకుని అరిచి చట్టుప్రక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ లింగం కేసు నమోదు చేసుకుని ధర్యప్తు చేస్తున్నట్లు చెప్పారు.


ప్రకృతి వనం.. వికృత రూపం..

● నిర్వహణ లోపంతో నెరవేరని లక్ష్యం



బృహత్ ప్రకృతి వనంలో నాటకుండా వదిలేసిన మొక్కలు

శివ్వంపేట, సెప్టెంబరు 20 : మండల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణ సరిగా లేక వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. మండల పరిధిలోని గోమారంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ గాలికి వదిలేయడంతో పిచ్చి మొక్కలతో కళాహీనంగా మారింది. రూ.3,16,966 ఉపాధి హామీ నిధులను వెచ్చించి ఏర్పాటు చేశారు. నాటడానికి తెచ్చిన మొక్కలను అలానే వదిలేశారు. ప్రకృతి వనం ప్రధాన ద్వారం ఎదుట పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో లోపలికి అడుగు పెట్టలేని పరస్థితి నెలకొంది. వనంలోని మొక్కలకు నీళ్లు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని బాగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో నాగేశ్వర్‌ను సంప్రదించగా తమకు గోమారం గ్రామంలో గృహతి పల్లె ప్రకృతి వనం ఉన్నట్లుగా తెలియదని ప్రకృతి నిర్వహణకు చర్యలు చేపడతామని తెలిపారు.





ప్రకృతి వనం ఎదుటపిచ్చిమొక్కలు, లోపల ఎండుతున్న మొక్కలు

రోడ్లకు మరమ్మతులు చేయరూ

● భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



వల్లంపట్ల నుంచి ఉప్పరోనిగడ్డకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద కోతకు గురై కొట్టుకుపోయిన రోడ్డు

మద్దూరు, సెప్టెంబరు 20: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారినా మరమ్మతులు చేపట్టకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రాణాలనరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన దుస్థితి. మండలంలో ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలకు వల్లంపట్ల నుంచి ఉప్పరోని గడ్డకు వెళ్లే కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గతంలో ఇదే కల్వర్టు కోతకు గురై కొట్టుకుపోగా కేవలం మట్టిపోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. వల్లంపట్ల నుంచి కూటిగల్‌కు వెళ్లేదారిలో నిర్మించిన కల్వర్టుకు కొద్ది నెలల క్రితం మరమ్మతులు చేపట్టినా కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నది. లక్కపల్లి నుంచి రేబర్తికి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద రోడ్డుకు కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో పాటు రోడ్డుపై పెద్దపెద్ద కంకరాళ్లు తేలాయి. ధర్మారం పిట్టలగూడెం నుంచి లక్కపల్లికి వచ్చే దారిలో బస్టాండ్ సమీపంలోనూ అదే పరిస్థితి. మండల ప్రత్యేకాధికారులు కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్లను సందర్శించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మండల అధికారులు గ్రామాల్లో ప్రమాదకరంగా మారిన రోడ్లను సందర్శించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



లక్కపల్లి నుంచి రేబర్తికి వెళ్లే దారిలో మట్టి కొట్టుకుపోయి కంకర తేలిన రోడ్డు

పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా!?

● ఏళ్లు గడుస్తున్నా పట్టని వైనం

● మద్దూర్ మండలం నుంచే పోలీస్ సేవలు

● స్టేషన్ ఏర్పాటు చేసి దూరాభారాన్ని తగ్గించాలని మండల ప్రజల వేడుకోలు

దూళిమిట్ట, సెప్టెంబరు 20: దూళిమిట్ట మండలం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. దీంతో దూళిమిట్ట మండల ప్రజలు ఉమ్మడి మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కే వెళ్లవల్సిన పరిస్థితి. చుట్టూ తిరిగి మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక ఇబ్బందిగా ఉందని మండల ప్రజలంటున్నారు. వర్షాలు పడి వాగులు పొర్లినప్పుడు మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. రెవెన్యూ సేవలు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అందుతున్నాయని, పోలీస్‌స్టేషన్ కూడా మండలకేంద్రంలోనే ఏర్పాటు చేస్తే సమయం ఆదా అవడంతో పాటు ప్రయాణ ఖర్చులు తప్పుతాయని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



దూళిమిట్ట మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి మండల ప్రజలకు దూరాభారాన్ని తగ్గించాలి. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే స్థానికంగానే మండల ప్రజలకు పోలీస్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇప్పటికైనా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయ్యే విధంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

– సుందరగిరి భాస్కర్, ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు



దూళిమిట్ట మండల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అప్పటి ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

● జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వం బీసీకుల గణన వెంటనే చేయాలని సిద్దిపేట జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కులగణన చేయలేదని, రాహుల్‌గాంధీ ఇచ్చిన వాగ్దానాన్ని నేరవేరుస్తారా? ధిక్కరిస్తారా? అని ప్రశ్నించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి తిరుపతి, జిల్లా విదర్శనం జిల్లా అధ్యక్షుడు కొమ్ము రాజుయాదవ్, టౌన్ అధ్యక్షుడు కృష్ణపురం లక్ష్మణ్‌రావు, ముదిరాజ్ ఉపాధ్యక్షులు తిరుపతి, గ్రామ అధ్యక్షుడు, శ్రీనివాస్‌గౌడ్, రాజు ప్రవీన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

కోహెడ, సెప్టెంబరు 20: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు శంకర్‌నగర్‌లో ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ దహనానికి విఫలాయత్నం

చేర్యాల, సెప్టెంబరు 20: చేర్యాల మండలంలోని చుంచనకోటకు చెందిన వడ్లకొండ సంజీవులు ఇంటి ఆవరణలో పార్క్ చేసిన బైక్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసేందుకు యత్నించారు. ఉదయం సీటు కాలిపోయి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసీఆర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

చేర్యాల, సెప్టెంబరు 20: చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శుక్రవారం బీఆర్ఎస్ అధినేత, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ స్థితిగతులు, మున్సిపల్ పాలన వ్యవహారాల గురించి చర్చించారు.



కేసీఆర్‌తో మునిసిపల్ చైర్‌పర్సన్

'కొమ్మూరి' మానసికస్థితిని పరీక్షించుకోవాలి

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 20: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన మానసికస్థితిని వెంటనే పరీక్షించుకోవాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వరుస ఓటములతో మానసికంగా కుంగిపోయారని ఎద్దేవా చేశారు. ఎలాంటి హోదా లేకున్నా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారని సొంతపార్టీ నాయకులు వ్యతిరేకిస్తున్నా కనువిప్పు కలగడంలేదని పేర్కొన్నారు. తనకు ఓట్లు వేయలేదని కార్యకర్తలు, ప్రజలపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని విమర్శించారు. జనగామ, చేర్యాల ప్రాంతాభివృద్ధికి అడ్డంకులు కలిగిస్తుండడం తగదన్నారు. ఇప్పటికైనా ఈప్రాంత సమస్యల పరిష్కారానికి పాటుపడాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బోయిని మల్లేశం, కర్రోల్ల ఎల్లయ్య, ఆరుట్ల రవీందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

● కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

గజ్వేల్, సెప్టెంబరు 20: మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.25 లక్షలు కల్పించాలని, మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కుమార్, సంతోష్, వెంకటేష్, యాదగిరి, నర్సింహులు, లక్ష్మి, యాదమ్మ, సైదమ్మ ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

'పురాతన శివాలయ అభివృద్ధికి కృషి'

అక్కన్నపేట, సెప్టెంబరు 20: కాకతీయుల కాలం నాటి శివాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మండలంలోని కట్కూర్‌లో పురాతన శివాలయాన్ని మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం సందర్శించి ఆలయంలో ఉన్న చెత్త, చెదారం, చెట్లను గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగించారు. ఇందులో కట్కూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందారెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉల్లెంగుల రాజు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ అంతరాయం.. స్తంభించిన సేవలు



బ్యాంకులో నిరీక్షిస్తున్న ఖాతాదారులు

కొండపాక, సెప్టెంబరు 20: మండలంలోని దుద్దెడ యూనియన్ బ్యాంకులో నెట్‌వర్క్ అంతరాయం కారణంగా వినియోదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం బ్యాంకు పని వేళలు ప్రారంభమైనప్పటి నుంచి నెట్‌వర్క్ రాకపోవడంతో వివిధ సేవల కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. రైతు రుణమాఫీ, పించన్లు తదితర పనుల మీద వచ్చిన వారు సాయంత్రం వరకు వేచి ఉండి వెళ్లిపోయారు.

రెవెన్యూశాఖ మంత్రికి వినతి

చేర్యాల, సెప్టెంబరు 20: చేర్యాల మండలం వీరన్నపేటను రెవెన్యూ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరుతూ మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి తదితరులు శుక్రవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు

ఎమ్మెల్యే 'పల్లా' పరామర్శ

దూళిమిట్ట, సెప్టెంబరు 20: మండలంలోని జాలపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ బద్దిపడగ క్రిష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, మేక సంతోష్, గ్రామ మాజీ సర్పంచ్ వరలక్ష్మీ సాగర్, యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, గ్రామ అధ్యక్షుడు నాగులపల్లి కుమార్ తదితరులు ఉన్నారు.

● **మద్దూరు:** మండలంలోని గాగిళ్లాపూర్‌లో ఇటీవల బొల్లు చంద్రమౌళి తండ్రి బొల్లు ఎల్లయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మద్దూరు, దూలిమిట్ట పార్టీ మండల అధ్యక్షులు సంతోష్, యాదగిరి ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ములుగు, సెప్టెంబర్ 20: అనారోగ్యంతో మృతి చెందిన ములుగులోని నరసయ్య కుటుంబసభ్యులను శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్లు బట్టు అంజిరెడ్డి పరామర్శించారు. కుటుంబానికి రూ. 10 వేలు అందజేశారు. ఆయనవెంట మాజీ ఎంపీటీసీ లింగ హరిబాబు, వార్డు సభ్యులు నాగేష్, శ్రీనివాస్, నాయకులు భూ చక్రం, కనకయ్య తదితరులున్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు20: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అభయోత్సవం కార్యక్రమం ద్వారా కేవలం రూ. 500లకే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ అందించాలన్న లక్ష్యంతో మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేసి చూపించారని కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ దరఖాస్తు చేసుకన్న లబ్ధిదారులకు ప్రొసెడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మమత, శ్రీకాంత్, ప్రసాద్, కిషన్, భార్గవ్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంజేపీ బాలుర పాఠశాలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

దౌల్తాబాద్, సెప్టెంబరు 20: మండల పరిధిలోని లింగారాజుపల్లి ఎంజేపీ బాలుర పాఠశాలను నేడు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సందర్శినున్నట్లు దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ కర్త రణం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసి రేషన్ డీలర్ల సంఘం సభ్యులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 21: తహసీల్దార్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌రావును మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెయజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మల్లేశం, శేఖర్‌రెడ్డి,సాయిలు, మొగులయ్య, భూషణం, లక్ష్మణ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

● విజయ డెయిరీ జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి



అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 20: పాడి రైతులకు పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని జిల్లా విజయ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో శుక్రవారం విజయ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులన్నీ వారం రోజుల్లో మంజూరు చేస్తామని గుత్తా అమిత్‌రెడ్డి హామీ ఇచ్చారని లక్ష్మారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 20: హుస్నాబాద్ పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, హెచ్ఎం వెంకటయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్, డి రవీందర్, సంపత్, కవిత, నిర్మలాదేవి, రాజేంద్రప్రసాద్, రాములు తదితరులున్నారు.

రుణమాఫీ చేయాలి: బాబు

మిరుదొడ్డి, సెప్టెంబరు 20: రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మిరుదొడ్డి గ్రామకమిటీ అధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మండలంలో రుణమాఫీ కాని రైతులతో ధర్నా చేస్తే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలయ్య, వెంకటయ్య, మల్లయ్య ఉన్నారు.

కిరాణా దుకాణాల్లో తనిఖీ

కుకునూరుపల్లి, సెప్టెంబరు 20: ముద్దాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నవనీత పలు కిరాణా దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పప్పు దినుసులు, శీతల పానీయాలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. గడువు ముగిసిన పదార్థాలు గాని వస్తువులు గాని ఉన్నాయ అని తనిఖీ చేశారు.

10 నెలలుగా పంచాయతీల్లో పైసలు లేక అవస్థలు

● ఎంపీడీవోకు కార్యదర్శుల వినతి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: 10 నెలలుగా పంచాయతీల్లో నిధులు లేక అవస్థల పడుతున్నామని, తమగోడు ఎవరు పట్టించుకోవడం లేదని హుస్నాబాద్ మండల పంచాయతీ కార్యదర్శులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డికి శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీల్లో రోజువారి కార్యకలాపాల నిర్వాహణ భారంగా మారిందని, ఇప్పటికే తమ జీతాల నుంచి డబ్బులు ఖర్చు చేసి పనులు కొనసాగించామన్నారు. ఇక తాము నిర్వాహణ భారం మోయలేమని ఎంపీడీవోతో తమ గోడు వెల్లబోసుకున్నారు. గ్రామస్థాయిలో తాము పడుతున్న ఇబ్బందులను పైఅధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, పది నెలలుగా రావాల్సిన బకాయిలు ఇప్పించి వచ్చే పండుగల నిర్వాహణ ఖర్చులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

● **మర్కుక్:** బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లకు గ్రామపంచాయతీల్లో నిధులు లేవని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు విద్యా వికాస్‌రెడ్డి అన్నారు. మర్కుక్ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో అబ్బలుద్దీన్, ఎంపీవో రాజలింగానికి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు ప్రతీ గ్రామపంచాయతీ ఖర్చుల కోసం తమ సొంత జీతం నుంచి ఖర్చు పెడుతున్నారని వాపోయారు. ఇకనైనా ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిద్దేశ్వర్, నాగభూషణం, నరేందర్, శాంతి, రాజశేఖర్, సంగీత, నీలిమ, వాణి, నవ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, రోజా, శృతి, శ్వేత ఉన్నారు.



మర్కుక్: ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజలందరూ భాగస్వాములవ్వాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు20: స్వచ్ఛతా హి సేవలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి గాంధీ పార్కులో పిచ్చి గడ్డి తొలగించి, వాటర్ ఫౌంటెన్ శుభ్రం చేశారు. అనంతరం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిచ్చి గడ్డి, చెత్త తొలగింపు చేసి మొక్కలకు నీరు పట్టారు. కార్యక్రమంలో ఎఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డులలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఆవరణలో ప్రదర్శన చేపట్టి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



చేర్యాల: కస్తూర్బా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

జీజీహెచ్‌లో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ

● ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు20: పట్టణంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో ప్రపంచ రోగి భద్రత దినోత్సవంలో భాగంగా శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయో మెడికల్, ఆసుపత్రిలో వ్యర్థలను పారవేయడం, సిబ్బందికి వ్యాక్సినేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,సెప్టెంబరు 20: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 68వ (ఎస్‌జీఎఫ్ఐ) స్కూల్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండలస్థాయి క్రీడలను శుక్రవారం సిద్దిపేట ఆర్డీవో సదానందం, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంబించారు. కార్యక్రమంలో దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, ఎంఈవో ప్రభుదాస్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్ రాజులు, వివిధ పార్టీల నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, లింగం, బాలాగౌడ్, జన్నారెడ్డి, ప్రభాకర్, పోతనక రాజయ్య, శ్రీనివాస్, దుబ్బరాజం, వంజరి శ్రీనివాస్, మల్లయ్య, క్రిష్ణ, సత్యనారాయణ, కుమార్ ఉన్నారు.

● **సిద్దిపేట రూరల్:** క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతాయని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వడ్డేపల్లి నాగరాజు, ఎస్‌జీఎఫ్ నారాయణరావుపేట మండల సెక్రెటరీ తోట సతీష్, వివిధ పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ సరస్వతి, రజిత, మహేష్, వెంకటేష్, నవీన్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ వేదికగా అండర్ 17, అండర్ 14 విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా మర్కుక్ ఎస్ఐ దామోదర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, పీఈటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి కుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, శంకర్‌రెడ్డి, సైదా, ఉపాధ్యాయులు ఆర్కె. రెడ్డి, కనకరావు, దయాకర్‌రావు, రమణారావు, టీవీఎస్ రెడ్డి, చిన్ని కృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

● **రాయపోల్:** చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు పాల్గొనాలని మండల విద్యాధికారి నర్సవ్వ పేర్కొన్నారు. రాయపోల్ ఉన్నత పాఠశాలలో ఆమె ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

● **కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు రెండో రోజు మరింత ఉత్సాహంగా జరిగాయి. పలు పాఠశాల జట్లు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఆటల్లో పోటీ పడ్డారు.

● **దూళిమిట్ట:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 68వ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన వారికి మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సహకారంతో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో దేశిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంఈవో దేశిరెడ్డి, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలరు దొడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.



మిరుదొడ్డి: జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న వెంకటయ్య



హుస్నాబాద్: కబడ్డీ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకోవాలి

● క్యాన్సర్‌పై సురభి ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 20: క్యాన్సర్ వ్యాధిపట్ల జాగ్రత్తలు వహిస్తూ ఎప్పటికప్పుడూ పరీక్షలు చేయించుకోవాలని సురభి ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డా.రాంప్రసాద్ సూపరింటెండెంట్ శివ రామాచారి అన్నారు. ప్రపంచ మహిళా గర్భాశయ, అండాశయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గర్భాశయ అండాశయ క్యాన్సర్ వ్యాధుల గురించి ఫ్రీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవగాహన క్యాంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగం తోగరికర్, ప్రొఫెసర్ మంజుకుమారి, సీనియర్ గైనకాలజిస్ట్ శివలత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ దివ్య, ఆర్ఎంవో చలపతి, పీఆర్వో పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా చిన్నబ్రహ్మయ్య

మర్కుక్, సెప్టెంబరు 20: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల్ని సిద్దిపేటలో శుక్రవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరైయ్యారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అందేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా దేమె

రామాయంపేట, సెప్టెంబరు 20: సిద్దిపేట మున్నూరు కాపు జిల్లా కన్వీనర్‌గా రామాయంపేటకు చెందిన కౌన్సిలర్ దేమె యాదగిరి నియామకమయ్యారు. ఈ మేరకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం మర్కుక్ మండల అధ్యక్షుడిగా గుండా శ్రీనివాస్ నియామకం



నియామకపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మర్కుక్, సెప్టెంబరు 20: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గుండా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మహాసభ సీనియర్ నాయకులు జూలూరి రంగయ్య, సముద్రాల హరినాథ్ చేతుల మీదుగా గుండా శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అర్థం లక్ష్మణ్, కోశాధికారి బల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుడాల అశోక్, ముఖ్య సలహాదారు శ్యాంసుందర్, సహాయ కార్యదర్శి తొడుపునూరి కుమార్, బెల్దే వెంకటేష్, తొడుపునూరి రమేష్, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, సెప్టెంబరు 20: చేర్యాల మండలం ముస్త్యాల ఆదర్శ పాఠశాలలో టీజీటీ తెలుగు, టీజీటీ హిందీ, టీజీటీ ఇంగ్లిష్, పీజీటీ బోటని సబ్జెక్టులను గంటల ప్రాతిపదికన బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆదర్శ పాఠశాలల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, అర్హత కలిగినవారు ఈనెల 23వతేదీ సాయంత్రం 4గంటలలోగా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలిని సూచించారు.

● **మద్దూరు** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శకుంతల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న పీజీటీ-సివిక్స్‌కు ఎంఏ విత్ బీఈడీ, టీజీటీ-ఇంగ్లిష్‌కు డిగ్రీ ఇంగ్లిష్ విత్ బీఈడీ అర్హతలుండాలన్నారు. ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.